# బోగీ నెం. ఎస్2

## కేతు విశ్వనాథ రెడ్డి


పట్టపగలే బ్రహ్మరాక్షసులెప్పుడొస్తారో, ఎటువైపు నుంచి వచ్చి మీదపడతారోనని బితుకుబితుకు మంటున్న జానపద కథల్లోని రాచవీధుల్లా కొన్ని రోడ్లు దారిలో కన్పించాయి. పదేళ్ళ వయసులో ఒక చీకటిరాత్రి ఒంటరిగా మా ఊరి పక్క కొండదారిలో నడుస్తున్నప్పుడు కలిగిన భయం; ఆ చిన్నవయసులోనే మరేనాడో మిట్టమధ్యాహ్నం శ్మశానంపక్క బండ్లబాటలో వెళ్తున్నప్పుడు ఒక గోరీమీద నిశ్శబ్దంగా గుడ్లు మిటకరించిన ఒక గుడ్లగూబను చూసిన క్షణాల్లో కలిగిన వణుకు; మనుషుల అలికిడి లేనిచోట ఎవరో వదేసి పోయిన చచ్చిన గొడ్డును జలదరింపు; గొర్రెదాటుగా రైలుపట్టాలను దాటాలనుకొని, ఆ పట్టాలకింద తెగిపడిన ఇరవయి ముప్ఫయి గొర్రెల మాంసఖండాలను ఇంటర్ చదివే రోజుల్లో చూసినప్పుడు కలిగిన ఆందోళన; వారం రోజులకిందట ఒకే ఒక జీవనాధారమైన తన గేదెలకోసం గడ్డిని కోస్తున్న మా పాలమనిషి యాదగిరిని విలువు నా పొట్టను పెట్టుకున్నారన్న వార్త తెలిసినప్పుడు కలిగిన దుఃఖం, నిర్వేదం, ఉద్వేగం మనసులో తెరలు తెరలుగా కదిలాయి. నాంపల్లి స్టేషన్లోని జనంమధ్య పడ్డాక ఆ తెరలు అప్పటికి మాయమయ్యాయి.

అంతమంది మధ్య తిరిగి వెలరోజుల యింది. పోలికల్లేని రకరకాల ముఖాలు కన్పిస్తున్నాయి. మూడు నాలుగు రకాల యాసలూ, భాషలూ విన్పిస్తున్నాయి. కులాలు, మతాలు ముఖంమీద రాసిలేవు. ఇక్కడో అక్కడో పట్టించినట్లుండే దుస్తులు, టోపీలు, గడ్డాలను బట్టే మాత్రం రెండు మతాలవారున్నట్లు తెలుస్తోంది. ఎగ్జిబిషన్ మధ్య తిరిగినట్లుంది. పోయిన హుషారు, సంతోషం తిరిగి వచ్చాయి. ముందు నా బోగీ, నా బెర్తూ చూసుకుని అక్కడ సూట్ కేసు పడేసి రైలు కదిలేదాకా ప్లాట్‌ఫాంమీద జనంలో తిరగాలనిపించింది. మూడు గంటలే అయింది. ఇంకా ఒక అరగంట వ్యవగి ఉంది. నా ఎస్2 ను వెతుక్కున్నా. కిటికీ పక్క సీటు, కింది బెర్త్. ఆబెర్తుమీద అపాటికే కూర్చొని ఉన్న దంపతులకు చెప్పి, నా సీట్లో సూట్ కేసి పడేసి, ప్లాట్‌ఫాం మీదికి దిగి పిచ్చిగా మళ్ళీ జనంలో పడ్డాను. 'జనం' ఎంత గొప్పమాట అని అనుకున్నాను. 'జనం జనం, జనం లేంది మనంలేం' ప్రయోజనకరమైన మంచి కవిత్వపాదా అనుకున్నాను.

రైలు కదలసాగింది. నా బోగీలోకి ఎక్కాను. తలుపు దగ్గర గుంపులేదు. సిగరెట్ కాల్చి, కాస్త తీరికగానే నా సీటు దగ్గరకు వెళ్దాం లెమ్మనుకున్నాను. ఎదురు తలుపుకు తిరిగి, దారి విడిచి నిలబడి సిగరెట్ ముట్టించుకుంటున్నా, సింకుకు ఎదురుగా, అటు పక్క ఆ ఎదురుతలుపును ఆనుకొని కూర్చొని ఉన్న ఒక సాధువు కన్పించాడు.

ముదురురంగు కాషాయపు అంగీ తొడుక్కొని, అంతకంటే తక్కువ రంగు అడ్డకట్టులో ఉన్నాడు. బట్టలు కుళ్ళు మాసి ఉన్నాయి. పక్కనున్న చేతి స... అంతకంటే ఘోరంగా మాసిఉంది తెల్లటి ముఖం, వెడల్పాటి నుదురు, పొడుగాటి గడ్డం, భుజాలు తాకుతూ జడలుకట్టిన వెంట్రుకలు, నిర్వికారంగా కన్పించాడు. ఘనీభవించిన గీతమో, శిలాజమో అన్పించింది.

అయోధ్య సంఘటనలు వాటికంతటికనే గుర్తు కొచ్చాయి. మానవ వైపరీత్యాలకు గురి అయిన హైదరాబాద్ దానికదే మనసులో మెదిలింది. అక్కడ నిల్చోవాలనిపించలేదు. నా సీటు చేరుకున్నాను. సూట్ కేసి తెరిచి, నిన్న చదువుతూ మధ్యలో ఆపిన ఆఫ్రికన్ నవలను తీసి, బెర్తుకింద సూట్ కేస్ పెట్టాను. బుక్ మార్క్ ఉన్నచోట నవలను తెరచాను. పెంపకం, కుటుంబ సంబంధాలు, తరతరాల జాతిరక్తంలో గడ్డకట్టిన మతవిశ్వాసాలు, అలవాట్లు మనుషులమీద ఎంత దారుణమైన ప్రభావాలను చూపుతాయో తెలిపే సన్నివేశాలు నవలలో వరుసగా ఎదురవుతున్నాయి. పేజీలు త్వరగా ముందుకు కదలడంలేదు. నా మనసులో మళ్ళీ అలజడి మొదలైంది. ముప్ఫయి పేజీలు కష్టంమీద చదవగలిగాను. రైలు నల్గొండ స్టేషన్ దాటింది.



పుస్తకాన్ని పక్కనబెట్టి, కిటికీలోంచి బైటికి చూడడం మొదలుపెట్టాను. అశాంతిని వదలించుకోడానికి ప్రకృతి దృశ్యాలకు మించిన మందులు లేవేమోననిపించింది.

ఎదురుగా, కిటికీలోంచీ, పడమటి ఆకాశం జేగురు రంగుతో, పసుపులో సున్నం కొంచెం కొంచెం కలుపుతూ పోతే వచ్చే వన్నెల విన్యాసాల్తో, ఆపైన నీలంలో, మధ్యమధ్య నల్లదనంలో, బూడిదరంగు మబ్బుల్తో కన్పిస్తోంది. ఎర్రమట్టిమూకుడు లాంటి సూర్యుడు కుంకిపోతున్నాడు. బీళ్ళలోనూ, పొలాల గట్ల మీదా తుమ్మ, తాటి, వేప ఇంకేవో చెట్లు కన్పిస్తూ కనుమరుగవుతున్నాయి. జొన్న, ఆముదం, వరి పైర్ల దృశ్యాలు ఒకదాని వెంట ఒకటి వరుసగా వెనుకబడి పోతున్నాయి. పచ్చి ఎక్కడుంటే అక్కడ తెల్లటి, నల్లటి, పుల్లటి ఆవులూ, ఆవుదూడలూ, పొట్టి, పొడుగాటి కొమ్ముల గేదెలూ, వాటి పడ్డలూ, సముల్లరంగు గొర్లూ, నల్లటి తెల్లటి బట్టరంగుల మేకలూ సహజీవనం చేస్తూ మేస్తున్నాయి. అవీ దాటిపోతూనే ఉన్నాయి. వాటిని చూస్తూంటే, ప్రకృతి తన సౌందర్యాన్నీ, సంపదనూ అమ్మలాగా అందరికీ పంచి పెడుతున్నట్లనిపించింది. ఆకాశంలోకి చూసినప్పుడు, ఆ సంధ్యా బీభత్సం మాత్రమే పచ్చదనం మీద దాడిచేస్తున్నదేమో అనిపించింది. ఆ బీభత్సం వెనుక, కోసిన పసిగొంతుల్లోంచీ, చేసిన గాయాల్లోంచీ, తెగిపడిన శరీరాల్లోంచీ నేలకు చిమ్మిన నెత్తురు అంతే ఎర్రెర్రగా, మట్టి కలిసి చల్లబడినప్పుడు అంతే నలనల్లగా ఉన్నట్లు తోచి, భయం కలుగుతోంది. శ్రీశ్రీ సంధ్యాబీభత్స దృశ్యం, జంటనగరాల్లో జరిగిన బీభత్సానికి ఏ మూలకూ సాటిరాదు. ఎందుకు రాదో? తలబద్దలవుతోంది. మిర్యాలగూడ దాటింది. చీకటి పడింది. చీకటిని చూస్తున్నా.

"మీరెంత వరకు వెళ్తున్నారు?" అనే ఇంగ్లీషు పలకరింపులో రైలు బోగీ సమాజంలో పడ్డాను.

"మద్రాసు," అని నన్ను పలకరించి



న. నా పక్క ప్రయాణీకుణ్ని గమనించాను. తెల్లగా, పొట్టిగా, పీలగా, పొడుగుముక్కుతో, ఎగదువ్విన, నెరసిన పలచటి క్రాపులో ఉన్నారాయన. ఆయన పక్క ఉన్నామె వాళ్ళావిడనే అయి ఉంటుందనుకున్నాను. తెల్లటి తెలుపు. నెడల్పాటి ముఖంమీద పావలలా అంత బొట్టు, తిన్నని నడిపాపిట, మెడలో ముత్యాల దండ, తాళిగొలుసు, చేతికి రెండేసి బంగారు గాజులు, ఎర్రచుక్కల పట్టుచీరలో ఉన్నారామె, పళ్ళు కొంచెం ఎత్తున్నట్లుంది. భర్తకంటే కొంచెం ఎత్తుగా, స్థూలంగా ఉంది. చూస్తూనే తమిళముఖమనిపిస్తోంది. పక్కన సీటుమీద తమిళపత్రిక కన్పించింది. విజ్‌డం పత్రిక పట్టుకొంది. ఎదుటి బెర్తుమీద యువదంపతులు చంటి పిల్లాడితో తంటాలు పడుతున్నారు. చివరి సీట్లో ఉన్న మధ్య వయసాయన అప్పుడే పైబెర్తు ఎక్కుతుండడం చూశాను.

నాపక్క ప్రయాణీకుడు — నన్ను బోగీ సమాజంలోకి లాగినాయన — తనను పరిచయం చేసుకున్నారు. చివరలో "మేమూ మద్రాసుకే" అన్నారు. అంత యదాలాపంగా పలకరించి తనను పరిచయం చేసుకున్న రామస్వామి అయ్యంగార్‌తో ఏరకంగా దిగాలో తెలియలేదు. రామస్వామి చెప్పిన వివరాల ప్రకారం: ఆయన పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ డిపార్ట్‌మెంట్‌లో ఆడిటర్‌గా పనిచేసి, అయిదేళ్ళకిందట రిటయిరయ్యారు. హైదరాబాద్‌లో నలభై ఏళ్ళుగా ఉంటున్నారు. మల్కాజిగిరిలో సొంత ఇల్లుంది. పెద్ద కొడుకు బొంబాయిలో ఉంటున్నాడు. చిన్నకొడుకు, కూతురు మద్రాసులో ఉంటున్నారు. అందరికి పెళ్ళిళ్లయ్యాయి. పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. నిష్పూచీ జీవితం.

మాట్లాడే తోడుకోసం తపించే రిటైరయినవాళ్ళ కలుపుగోలుతనం రామస్వామిలో కన్పించింది. కొందరికది చాదస్తంగా కన్పించవచ్చు. నాకు మాత్రం అటువంటి వాళ్లతో మాట్లాడడంపట్ల వైముఖ్యంలేదు. నాకంటే నలభై ఏళ్ళ పెద్దవాడిని వింటే, ఆ అనుభవాలు వృథా పోవని అభిప్రాయం, పైగా మనసులోని ఈ నెలరోజుల ముసురు తొలగిపోవడానికి ఆయనతో కబుర్లకు దిగితేనే మంచిదేమో అని మనసుపీకింది. ఏ విషయాలు చర్చిస్తే బాగుంటుందోనని ఆలోచనలో పడ్డాను. నేనంత మాటకారిని కాను. అదే చిక్కు, కొంచెం ఆవేశం కూడా ఎక్కువే. అదొక తంటా.

రామస్వామి ఇంగ్లీషులో మళ్లీ అందుకున్నారు:

"మా కోడలు ప్రసవించింది. మగబిడ్డ. చూడటానికి వెళ్తున్నాం ఇద్దరమూ. మూడు వారాలుగా వెళ్ళలేకపోయాం"

"వై? యు షుడ్ హేవ్ గాన్", అన్నాను అప్రయత్నంగా, హైదరాబాదు మద్రాసు ఎక్స్‌ప్రెస్ కర్ఫ్యూ రోజుల్లో కూడా నడిచిన విషయం గుర్తుకొచ్చి, నా మాటల్లో మర్యాదలోపించినట్లు తర్వాత అనిపించింది.

మూడు వారాలకిందటే ఎందుకు వెళ్ళలేకపోయారో రామస్వామి చెప్పలేదు. నా ఇంగ్లీషు వాక్యంలోని షుడ్ మీద ఉపన్యాసమిచ్చారు. సందర్భాన్నిబట్టి షుడ్‌ను తప్పుల్లేకుండా ఉపయోగించగలిగిన అతికొద్ది మందిలో తానొక్కరని చెప్పారు. ఇంగ్లీషు దొరలు సైతం మెచ్చుకున్నారన్నా తాను మద్రాసు వివేకానంద కాలేజీ స్టూడెంటునని సగర్వంగా చెప్పారు. తమ తరంలోని ఇంగ్లీషు భాషా పాండిత్యం ఇప్పటివాళ్ళకు లేదన్నారు. సెలవు చీటీ తప్పుల్లేకుండా రాయలేరన్నారు. భాషాస్వచ్ఛత నశించిపోతోందని బాధపడ్డారు. దీనికి కారణం కల్చర్‌లో వచ్చిన క్షీణతే అని అన్నారు. కల్చర్‌కూ కల్టివేషన్‌కూ సంబంధముందన్నారు. ఒకే రూట్‌నుంచి ఆ పదాలు వచ్చాయని చెప్పారు.

ఇదేదో నాకు కొంత తెలిసిన విషయమేననిపించింది.

"ఏ రకంగా, ఏంటి సంబంధం?" అని అడిగాను.

ప్రశ్న వింటూనే మాటమార్చి, నా ముఖంలోకి చూస్తూ "మీ పేరు చెప్పలేదు" అన్నారు.

ముఖంలోకి రామస్వామి అట్లా చూస్తూంటే తడబడి "చంద్ర" అన్నాను. ఇంటి పేరడగలేదు. బతికిపోయాను.

"స్వస్థలం హైదరాబాదేనా?"

"కాదు. కర్నూలు జిల్లా కోయిలకుంట్ల దగ్గర"

నా జవాబు వింటూనే, రామస్వామి ధారాళంగా తెలుగులో మాట్లాడడం మొదలుపెట్టాడు.

"నేను ఆంధ్రాలో అన్ని జిల్లాలూ చూశాను. మాది తంజావూరుజిల్లా. కావేరిగట్టున ఉండే తిరువాయూరు. నాదబ్రహ్మ త్యాగరాజ స్వామి జన్మస్థలం. ఒకమారు ఇన్‌స్పెక్షనప్పుడు కోయిలకుంట్లలో రెండు రోజులున్నాను. ఆళ్లగడ్డకు వెళ్ళినప్పుడు అహోబిలం చూశాను. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో నీళ్ళు తక్కువ. జొన్నరొట్టెలు, కారం తింటారు. అందుకే అక్కడి మనుషులకు ఎక్కువకోపం. పట్టుదలలు ఎక్కువ. కానీ మంచివాళ్ళు. కావేరి పక్కనో, గోదావరి, కృష్ణ నదుల పక్కనో చూడండి. ఆ కల్చర్ వేరు. నీళ్ళు ఎంత తీసుకుంటే అంత తెలివితేటలబ్బుతాయి..."

భార్యనడిగి నీళ్ళసీసా అందుకొని రామస్వామి నీళ్ళు తాగటంలో నిమగ్నులయ్యారు. బలవంతంగా వచ్చేనవ్వును ఆపుకున్నాను. ఆయన తర్కం పూర్తిగా అర్థం కాకపోయినా కొంటెతనం కొద్దీ ఒక ప్రశ్న అడిగాను:

" 'అయితే సముద్రం పక్కన ఉన్న వాళ్ళు మరింత తెలివిగలవాళ్ళు అవుతారుకదా, మీ వాదం ప్రకారం?"

"సముద్రంనీళ్ళను తాగం. వ్యవసాయానికి వాడుకోం. కానీ సముద్రం వ్యాపారానికి తోడ్పడుతుంది. ఆ రకంగా కల్చర్‌ను పెంచుతుంది. మీరు మద్రాసు సంగతే తీసుకోండి. ఇప్పటికీ మన క్లాసికల్ మ్యూజిక్, మన ట్రెడిషనల్ ఆర్ట్స్ అక్కడే జీవించి ఉన్నాయి. అక్కడి టెంపుల్ కల్చర్ కూడా చాలా గొప్పది. కపాలేశ్వర ఆలయం ఆ కల్చర్‌కు ఒక సింబల్"

"క్షమించండి మద్రాసులోని టెంపుల్ కల్చర్ విషయంలో నా అనుభవం వేరు. పోయినసారి మద్రాసు వెళ్ళినప్పుడు మైలాపూర్‌లోని రామకృష్ణమఠానికి దగ్గరగా బృందావన్ హోటల్లో దిగాను. ఎదురుగానే దేవాలయం. దేవాలయం ముందు ఎండిపోయిన పుష్కరిణి కన్పించింది. తెల్లవారు జాము భక్త బృందం రోడ్డుమీద పాటలు పాడుకుంటూ పోతోంటే, విని చూశాను. ఆ సమయంలోనే ఎండిపోయిన పుష్కరిణిలో ఒకరిద్దరు దొడ్డికి కూర్చుంటున్న దృశ్యం కళ్ళబడింది. చుట్టూ మురికి, కొట్లు, వ్యాపారం..."


అంతటిలో నేను ఆగటం మేలైంది. అనిపించింది. ఆగి ఆయన ముఖంలోకి చూశాను.

రామస్వామి చాలా నొచ్చుకుంటూ అన్నారు:

"మీరన్నది నిజమే. మా అమ్మాయి ఇల్లు మైలాపూర్లోనే. ఒకప్పుడు అక్కడికి వెళితే గొప్ప శాంతి లభించేది. ఇప్పుడంతా మారిపోయింది. డి.ఎం.కె పుట్టటంలోనే తమిళనాడు కల్చర్ ధ్వంసమైంది. వాళ్ళు బ్రాహ్మణద్వేషం రెచ్చగొట్టారు..."

"వాళ్ళేమీ బౌద్ధులో జైనులో కాదు కదా. అందరూ హిందువులే కదండీ," అన్నాను.

రామస్వామి నన్ను అనుమానంగా



చూస్తూ అన్నారు:

"ఏం లాభం? భగవద్గీత అర్థంకాని వాళ్ళు. జాతివేరు, కర్మవేరు. కర్మనుబట్టి ఎవరైనా బ్రాహ్మణులు కావచ్చు. అయినప్పుడు బ్రాహ్మణవ్యతిరేకత ఎందుకు? బుద్ధుడు బ్రాహ్మణుడుకాదా? తీర్థంకరుడు బ్రాహ్మణుడుకాడా? ఆళ్వారులూ, నయనార్లూ కారా?"

రామస్వామి వీరావేశంగా ఈ మాటలంటున్నప్పుడు, ఖురాన గుండెలకదుముకొని వెళ్తున్న ఒక ముస్లిం యువకుడటు వెళ్ళాడు. లేతనీలంరంగు చొక్కా లుంగీల్లో ఉండి, టోపీలు ధరించిన అయిదారుగురు ఆ యువకుడి వెంట నడవటం రామస్వామీ, నేనూ చూశాము. ట్రైన్లోనే సాయంకాల ప్రార్థనలు, ఖురాన్ పఠనమూ నేను నాలుగైదుసార్లు ఇంతకుముందే చూసి ఉన్నా. వాళ్ళటు వెళ్తానే రామస్వామి అందుకున్నారు:

"మా డిపార్ట్మెంట్లో ఒక ముస్లిం సామర్థ్యాన్ని చూసి, పది ప్రమోషన్లకు రెకమెండ్ చేశాను..."

కొంత ఆగి రహస్యం చెపుతున్నట్లు గొంతు తగ్గించి అన్నాడు

"అయోధ్యమీద ఇంత గలాటా ఎందుకో నాకర్థంకాదు. హైదరాబాద్లో అన్ని ఘోరాలెందుకు జరిగాలి అనిపిస్తుంది. ఆ మసీదును పక్కన కట్టుకోటానికి ఒప్పుకొని ఉంటే ఇన్నిన్ని వంతాలు, ఘర్షణలు ఉండకపోను"

ఆయనమనస్తత్వమూ, తర్కపద్ధతీ కొంత అర్థమయ్యాయి. ఆయన లేపిన చర్చలోకి దిగటమా, మానటమా, దిగితే ఆయనను నేను నా వాదంలోనో, ఆవేశంలోనో గాయపరుస్తానేమో, దిగకుండా ఉండడమే మేలేమో, వాదప్రతివాదాల వల్లనే మనుషులు సులభంగా మారరేమో అనే సందేహాల్లో పడ్డాను. రామస్వామి మాటల వెనుక కన్పించే సంప్రదాయాన్ని గురించి మనసులో వితర్కించుకుంటూ మౌనం వహించాను.


రామస్వామి తన ధోరణి విడవలేదు:

"ఉదాహరణ ఒకటి చెప్తాను, పరిశీలించండి. నేను 'గీత' మీద ఉపన్యాసాలిస్తుంటాను. ఇంగ్లీషులో, తమిళంలో, తెలుగులో, 'గీత' మన వేదాంతానికి చివరి మెట్టు అని నా అభిప్రాయం. బొంబాయిలో మా పెద్దవాడున్నాడని చెప్పానే, వాడు పుట్టపర్తి సాయిబాబాను తప్ప మరిదేన్నీ నమ్మడు. సంవత్సరానికొక్కసారైనా పుట్టపర్తికి వెళ్ళి వారం రోజులుండి వస్తూ ఉంటాడు. నాకు మిరకల్స్ మీద నమ్మకంలేదు. మిరకల్స్కు మన వేదాంతంలో చోటులేదు. అయినా వాడిష్టం వాడిది. నా అభిప్రాయాలు నావి. వాడు నా అభిప్రాయాల్ని చాలా గౌరవిస్తాడు".

"ఏమైనా అతను మీకొడుకు కదండీ," అన్నాడు.

నా మాటల అంతరార్థం రామస్వామికి బోధపడిందో లేదో తెలియదు.

"ఎవరైనా ఒకటే. ఏమతం వాళ్లయినా ఒక్కటే. ముస్లిములు కూడా ఇచ్చిపుచ్చుకోవాలి," అంటూ రామస్వామి ఇంకేదో చెప్పబోయారు. నడికూడి జంక్షన్లో రైలు ఆగటంలో మా చర్చలకు తాత్కాలికంగా తెరపడింది.




రామస్వామి భార్య ఆయన ఖాళీచేసిన నీళ్ళసీసాను మౌనంగా అందించింది. ఆయనవెంట నేనూ, బోగీ దిగుతూ, వెనుక తలుపు దగ్గర సాధువున్నాడో లేదోనని చూశాను. లేదు.

ప్లాట్ఫాం మీద ఉన్న ఒకే దిమ్మెకమర్చిన నాలుగు కుళాయిల్లో ఒకదానిదగ్గర సాధువు నీళ్ళు తాగుతూ కన్పించాడు. నిలబడిన తీరును చూసి "పాపం కుంటివాడు" అనుకున్నాను. సాధువుకు ఎదురు కుళాయి దగ్గర ఒక ముస్లిం క్యాన్లో నీళ్ళుపట్టుకున్నాడు. మరొకవైపు రామస్వామి నీళ్ళు పట్టుకుంటూంటే ఎదురుగా కుళాయిలో నీళ్ళు తాగి పక్కన నిలబడి సిగరెట్ ముట్టించుకున్నాను. ఒకే దిమ్మెకున్న ఆ నాలుగు కుళాయిలూ నాలుగు మతాలైతే అనే కార్టూన్ ఆలోచన వచ్చి నవ్వుకున్నాను.

అటు ఇటు చూస్తోంటే, మరో వెనుక బోగీదగ్గర పదిమంది మధ్య పూలమాలలు వేసిన సిల్కు కాషాయంలోని గురువెవరో కన్పించాడు, ఆ మసక వెలుగుల్లో, పేదసాధువు ఆ గుంపులో ఉన్నాడేమోనని వెతికాను. కన్పించలేదు. రామస్వామి ఆ గురుభక్తి దృశ్యాన్ని చూసినట్లుంది. నీళ్ళసీసాతోనే గబగబా వెళ్ళి దూరం నుంచీ చెప్పులు విడిచి నమస్కరించి, బోగీలోకి వెళ్లారు.

నేనూ బోగీలోకి ఎక్కి తన మామూలు స్థలంలో పేద సాధువున్నాడేమోనని చూశాను. లేదు. అక్కడే తలుపుదగ్గరున్న ఇద్దరు ముస్లింలు వెనుకబోగీ ముందరి దృశ్యాన్ని చూసినట్లుంది. ఇద్దరిలో ఒకరు వినిపించీ వినిపించనట్లు ఉర్దూలో అన్నాడు "ఎవరో పెద్దసాధువు" అని. రెండో అతను "వాళ్ళ మతనాయకుడు" అని గొణిగి అక్కడే ఉన్న నావైపు చూసి బోగీలోపలికి వెళ్ళిపోయాడు. అతని జంకుచూసి సిగ్గుపడ్డాను.

సీటువద్దకు వెళ్లే వేళకు, ఆపాటికే రామస్వామి దంపతులు టిఫిన్ కారియరు విప్పి భోజనాలు కానిస్తున్నారు. ఎదురు సీట్లోని ఆవిడ పసిపిల్లవాడికి పాలు

రుచికరమైన 19
రకాలలో లభ్యం
కాగలవు.




ఇంట్లో తయారు చేసినట్లు రుచి. తయారుచేసుకునే శ్రమే లేదు.

పడుతోంది. భర్త సాయం చేయటంలో ఇబ్బందులు పడుతున్నాడు.

రామస్వామి అడిగాడు, "మీరు భోజనం తెచ్చుకున్నారా" అని.

"డిన్నరు ఆర్డర్ చేశాను. గుంటూరులో వస్తుంది," అన్నాను.

నన్నులమీద ఉన్నంత శ్రద్ధను భోజనంమీద కూడా గమనించి రామస్వామికి జీవితంలో ప్రతిదానిమీదా శ్రద్ధ ఉంది అనుకున్నాను.

రామస్వామి చేతులు తుడుచుకుంటూ నావైపు తిరిగి అన్నారు:

"మా అమ్మగారైతే ఇప్పటికీ ట్రైన్లో నచ్చినంచినీళ్ళు ముట్టరు"

"పాతతరం కదండీ," అన్నారు.

"తిరువాయూర్‌లోనే ఉంటుంది. త్యాగరాజస్వామి భక్తురాలు. నాకైతే భక్తి జ్ఞాన కర్మమార్గాల్లో కర్మమార్గంమీదనే దృష్టి."

"ఉద్యోగులు కావడంవల్లనేమో?" అన్నాను.

"ప్రతిజీవీ ఏదోరకంగా ఉద్యోగే కదా?" అని రామస్వామి ఎదురు ప్రశ్న వేశారు.

ఆ వేదాంత పద్ధతి నాకు అందినా, "లక్షలమంది దేశంనిండా నిరుద్యోగులున్నారుకదా?" అన్నాను, కొంచెం కవ్వింపుగానే.

దాన్ని ఆయన పట్టించుకోకపోవటం మేలైంది. అప్పుడు నాకు ముగ్గులోకి దిగాలనిపించింది. ఆయనతో అన్నాను:

"నడికూడి స్టేషన్లో జనం పూలదండలు వేసిన సాధువుకు మీరు దూరం నుండి నమస్కరించారు. మీ పక్క కుళాయిలో నీళ్లుతాగిన పేదసాధువును మీరు గుర్తించినట్లులేదు. మన బోగీలోని ముస్లిములను కూడా గమనించాను. వాళ్ళు ముల్లాలకిచ్చే గౌరవం పేద ఫకీర్లకిస్తారనుకోను మన విలువల్లో, నమ్మకాల్లో ఈ తారతమ్యమెందుకుందోనని అప్పటి నుంచి ఆలోచిస్తూనే ఉన్నాను..."

ఊహించని ఈ చర్చాపద్ధతికి రామస్వామి తబ్బిబ్బు పడినట్లు తోచింది. ఆయన కాసేపు మాట్లాడకుండా ఆలోచనలో పడ్డాడు. తర్వాత నెమ్మదిగా అన్నాడు:

"మీరు ప్రస్తావించిన స్వామీజీ ఒక పీఠాధిపతి అని నాకు గుర్తు. ఎక్కడో చూశాను. నమస్కరించాలనిపించింది".

రామస్వామి భక్తిజ్ఞాన కర్మమార్గాల రాజీ నాకు నచ్చక అన్నాను:

"మన బోగీలోని ఒక ముస్లిం 'వాళ్ల మతనాయకుడు' అని ఆయనగురించి అనటం నేను విన్నాను. ఎవరైతేనేం? ఆయన్ని చూశాను. ఆయన్ని గురించి విన్నాను. మతంలో రాజకీయాలు కలిపే గురువు. కులమత విశ్వాసాలు రాజకీయాల్లోకి చొరబడడం చూస్తే నాకు బాధ. దాన్ని నివారించలేని చేతగానితనం గుర్తుకొస్తే కోపం. అన్ని కులాల్ని, మతాల్ని కట్టగట్టి తగలబెడితే మీరనే 'కల్చర్' ముందుకుపోదా అనిపిస్తుంది. మీకు చెప్పగలిగినంత వయసుకాదు నాది. జ్ఞానం కూడా కాదు. వ్యక్తులుగా మనకు "కల్చర్" ఉందనుకుంటాం. మనం అలవరచుకునే గుంపు మనస్తత్వంలో ఆ సంస్కారం పోతుంది. మన వ్యక్తిత్వాల్లోనే ఈ విలువుచీలిక ఉందనుకుంటాను"

రామస్వామి నావైపు వింతగా చూశారు. రెండుమూడు నిముషాల తర్వాత అన్నారు:

"ముస్లిములే దీనికి కారణమేమో

"వాళ్లందరినీ ఒక మతస్థులుగా కట్టగట్టి ఆ మాట అనగలుగుతున్నారు. హిందువులు, బౌద్ధుల్నీ, జైనుల్నీ, కిందికులాల వాళ్ళనీ చెండాడుకున్నట్లే, సున్నీలు షియాలను, చెండాడుకున్నారు. వాటి పరిణామాలనే ఇప్పుడు చూస్తున్నాం. చిన్న గుంపులు, పెద్ద గుంపులు, మఠాలు అంతే భేదం. స్వార్థాన్ని బట్టి వీటి రంగులుంటాయి. ఆ స్వార్థం డబ్బుదైనా కావచ్చు. అధికారానిదైనా కావచ్చు. రెంటిదీ కావచ్చు"

నా వాదన రుచిచూశాక, రామస్వామి ఆ తర్వాత నాతో మాట్లాడితే ఒట్టు. గుంటూరు దాటాక వాళ్ల బెర్తు ఇబ్బందిని గమనించాను. రామస్వామి భార్య పాపం పెద్దావిడ, ఆవిడ మధ్య బెర్తుకెక్కలేదని గుర్తించాను. ఆమెను కింది బెర్తు తీసుకోమన్నాను. పై బెర్తుమీదికి నేను వెళ్తానని చెప్పాను. ఆమె అయితే కృతజ్ఞతలు చెప్పారు కానీ, రామస్వామి మాత్రం నాతో మాట్లాడలేదు.

ఆ రాత్రి నాకు సరిగా నిద్రపట్టలేదు. బోగీలో మనుషులు, నన్ను వదల్లేదు. నాలుగైదు పర్యాయాలు బెర్తుదిగి, మూసిన తలుపులదగ్గరకు వెళ్ళి ఖాళీగా ఉన్న కండక్టరు సీటులో కూర్చొని ఆ శాంతిని దూరం చేసుకుంటున్నాననే భ్రమలో సిగరెట్లు కాల్చుకున్నాను. బోగీలో అన్నిటికి అతీతంగా ఎవరి నిద్రలో వారు. ఎవరి కలల్లో వారు మనల్ని తప్ప, మరి దేన్నీ పట్టించుకోకపోవటంలో ఎంత సుఖముందో ఆ రాత్రి తెలిసింది.

తెల్లవారింది. చీకట్లు విచ్చుకుంటున్నాయి. ఉదయం ఒళ్ళు విరుచుకుంటోంది. రైలు మద్రాస్ సెంట్రల్ చేరింది. జనసందోహంలో కలిసి తన గమ్యం కోసం తాను పోతున్న రామస్వామిని చేరుకొని "సార్! ఒక్క నిముషం" అన్నాను. ఆయన అయోమయంగా నావైపు చూశాడు. నేను గబగబా అన్నాను:

"నా మాటలు బాధించి ఉంటే క్షమించండి. మీరు నాకంటే పెద్దవారు. మీరన్నది నిజం. ఇచ్చిపుచ్చుకోవాలి. మతం ఒక నమ్మకం మాత్రమే కదండీ! దానికి ఈ రోజుల్లో ప్రాణాలు తీయటమే కాని, ఇవ్వటం తెలియదు, పాపం"

ఆయన నీరసమైన నవ్వునవ్వి, ముందు నడుస్తున్న భార్యను చేరుకోడానికి అడుగులు వేశాడు. వదలకుండా పట్టుకుని మనసులో ఉన్నది చెప్పాను:

"మరొకందుకు కూడా మీరు నన్ను మన్నించాలి. నా అసలు పేరు మీతో నేను చెప్పలేదు. నాపేరు చాంద్ భాషా. తెలుగు లెక్చరర్ని కాబట్టి నన్నందరూ 'చంద' అని పిలుస్తారు.

రామస్వామి పెదవివిప్పలేదు. కాస్త దూరంగా నిలబడి మమ్మల్ని చూస్తున్న తన భార్యదగ్గరకు రామస్వామి చేరుకున్నాడు.

"కీల్సాకు పయ్యా" అని తమిళంలో రామస్వామి తన భార్యతో నన్నుగురించి అనటం మాత్రం నాకు వినిపించింది.

## కమల్ మళ్ళీ హిందీ చిత్ర ప్రవేశం!



*

అప్పూరాజా (విచిత్రసోదరులు హిందీ చిత్రం)తో కమల్‌హాసన్‌కు మళ్ళీ నార్త్‌లో డిమాండ్ పెరిగింది. కమల్ హీరోగా రాజ్‌కుమార్ సంతోషి (ఆఫ్ 'ఘాయల్' ఫేమ్) ఓ సినిమా తీస్తున్నాడు. ఆ చిత్రంలో కమల్‌హాసన్ పాత్రకు అసలు డాన్స్‌లంటూ ఉండవట

'నాకతని అద్భుతమైన నటన చాలండీ!' అంటున్నాడు సంతోషి! సంతోషమేమరి!

